ప్రశాంతంగా 'నీట్'

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షల నిర్వహణను భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ విఎన్.మణికంఠ చందోలు పరిశీలించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన నీట్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాలైన పివికెఎన్, సావిత్రమ్మ డిగ్రీ కాలేజీలలో పరీక్షల నిర్వహణను, బందోబస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పివికెఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జీవన జ్యోతి, సావిత్రమ్మ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ శరవణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు

అంగన్వాడీలకు యాప్‌ల కష్టాలు..

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

అంగన్వాడీ కార్యకర్తలు యాప్‌లతో సతమతవుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థుల హాజరు, గర్భవతులు, బాలింతలు సంబంధించి పోషకాలతో పాటు పిల్లలకు అందించే ప్రతి ఒక్కటీ ఆన్లైన్ యాప్‌ల ద్వారా సమాచారాలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయాల్సిందే. దీంతో గ్రామీణ ప్రాంతాలలో నెట్‌వర్క్ సక్రమంగా అందక, అప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయలేక అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ యాప్‌ల భారం నుంచి తమకు విముక్తి కల్పించాలని, కార్యక్రమాల నమోదు ఆన్‌లైన్ కాకుండా ప్రత్యామ్నాయం చూడాలని వేడుకుంటున్నారు.

ఇదిలా ఉండగా అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గతంలో భారీ సమ్మె సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు హామీలను కురిపించింది. గత వైసిపి ప్రభుత్వం హామి ఇచ్చినా ఒక్క హామీని కూడా అమలు చేసిన పాపాన పోలేదు. అంతేకాకుండా ఎన్నికల ప్రచార సమయంలోనూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు పలు హామీలను ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా.. నేటికీ వారికి యాప్‌ల భారం, సమస్యల పరిష్కారం కాలేదు. ఇప్పటికీ వారు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సెంటర్‌కు చిన్నారులు ఆలస్యంగా వస్తే వారికి అన్నం కూడా పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలంలో కొత్తపల్లి సెక్టార్‌కు సంబంధించి 19 మెయిన్ సెంటర్లు మూడు మినీ సెంటర్లు ఉన్నాయి. పుల్లూరు సెక్టార్‌కు 13 మెయిన్ సెంటర్లు ఐదు మినీ సెంటర్లు, ఎస్ఆర్ పురం సెక్టార్‌కు 20 మెయిల్ సెంటర్లు ఆరు మినీ సెంటర్లు ఉన్నాయి. ఎస్ఆర్ పురం మండలంలో మొత్తం 52 మెయిన్ సెంటర్లు 14 మినీ సెంటర్లు ఉన్నాయి. మండలంలో 66 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 66 మంది హెల్పర్లు ఉన్నారు. గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల నుంచి పకడ్బందీగా ప్రభుత్వం మెనూ అందించే ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలి యాప్‌లలో అప్లోడ్ చేయాలి. కొంతమందికి మొబైల్ యాప్‌లో అప్లోడ్ కాక అవస్థలు పడుతున్నారు. ఈ యాప్‌ల నిర్వహణ అప్లోడ్లు కానీ టీచర్లపై ఒత్తిడి చేస్తున్నట్లు అంగన్వాడీలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా బాల సంజీవని కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో వర్కర్లు హెల్పర్ల ఫోటోలను క్యాప్చర్ చేసి గర్భిణీలు బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారం ఆహారం అందించాలి. తరచూ సాంకేతిక లోపంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అంగన్వాడీలు చెబుతున్నారు.

హాజరు సరే.. మరీ భోజనం ఎలా..?

పని దినాలలో ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్త ఉదయం 9 గంటలకు ఒకసారి మరల సాయంత్రం 4 గంటలకు ముఖంతో ఫోటో తీసి అప్లోడ్ చేయాలి. తదుపరి ప్రతి ఒక్క పిల్లల హాజరు ఫోటో తీసి అప్లోడ్ చేయాలి. ఈ విధంగా హాజరు చేసుకుంటూ ఉంటే యాప్‌లో అప్‌లోడ్ చేయడానికే సమయం సరిపోతుంది. ఇక పిల్లలకు పౌష్టికాహారం ఎప్పుడు అందించాలని ప్రశ్నిస్తున్నారు. అప్లోడ్ చేసిన తరువాత ఎవరైనా పిల్లలు లేటుగా వస్తే ఆహారాన్ని అందించే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా ఉందంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుకుంటున్నారు.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలి..

- వాడ గంగరాజు, యూనియన్ గౌరవాధ్యక్షుడు

జిల్లాలో 2420 అంగన్వాడీ సెంటర్‌లో ఉండగా దాదాపు వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు 4700 వరకు మంది పనిచేస్తున్నారు. ఇందులో 680 మంది మనీ వర్కర్లు పనిచేస్తున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రాజెక్టు స్థాయిలో సమస్యలు రోజుకి పెరిగిపోతున్నాయి. ఈ సమస్యలపై 45 రోజులకు ఒకసారి జిల్లా ప్రాజెక్టు అధికారి సమన్వయ కమిటీ సమావేశం జరిపి సమస్యలు పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ జిల్లాలో ఎక్కడా కూడా ప్రాజెక్టు స్థాయిలో సమావేశం జరపడం లేదు. వారి పని కోసం సమావేశం జరిపి సమస్యలు చర్చించకపోవడం దారుణం. జిల్లాల్లో ఉన్న 680 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. జిల్లాలో నగిరి ఐరాల, బైరెడ్డిపల్లి, బంగారుపాలెం ప్రాజెక్టు అధికారులు వర్కర్లను ఇబ్బందులు చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కానీ వాటిపై దృష్టి సారించడం లేదు. అంగన్వాడీల దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాజకీయ వేధింపులు మానుకోవాలి.

వేతనాల ప్రస్తావనే లేదు

- విజయ, యూనియన్ అధ్యక్షురాలు, కార్వేటినగరం

ప్రభుత్వం రకరకాల పనులు చెబుతూ పని భారం పెంచుతుంది గాని వేతనాల గురించి మాట్లాడే పరిస్థితియే లేదు. గతంలో ఇచ్చిన మొబైల్ ఫోన్లో బాల సంజీవని 2.0 వెర్షన్ యాప్‌లు పనిచేయడం లేదు. పాత ఫోన్లు వెనక్కి తీసుకొని ఆస్థానంలో 5జీ ట్యాబులు పంపిణీ చేసి అంగన్వాడీలకు యాప్‌లా కష్టాలు తొలగించాలి. ఈ సమస్యలను అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

- చెంచులక్ష్మీ, ఎస్ఆర్ పురం మండలం ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హులైన అంగన్వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలి. వేతనాలను సకాలంలో అందించాలి. సకాలంలో వేతనాలు అందకపోవడంతో కార్యకర్తలు హెల్పర్ల కుటుంబ పోషణ భారంగా మారుతుంది. కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

గుంపు గొడవ వల్లే ఏనుగు మృతి

డీఎఫ్ఓ భరణి స్పష్టం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గుంపు కలహాల వల్లే గున్న ఏనుగు మృతి చెందిందని జిల్లా అటవీ శాఖ అధికారి భరణి స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక అటవీశాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎఫ్ఓ భరణి మీడియాతో మాట్లాడారు. బంగారుపాళ్యం మండలం పరిధిలోని మొగిలిగాని చెరువు వద్ద మృతి చెందిన గున్న ఏనుగు నాటు బాంబు పేలి గాయం కావడం వలన చనిపోలేదని, ఏనుగుల గుంపులో ఉన్న గున్న ఏనుగుపై తోటీ ఏనుగులు దాడికి పాల్పడగా గాయపడి అస్వస్థతకు గురై మృతి చెందిందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎఫ్ఆర్ఓ థామస్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ భరణి

అంగన్వాడీ కేంద్రాల ద్వారా సేవలు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఐసిడిఎస్ జిల్లాలోని గర్భవతులు, బాలింతలు, ఐదు సంవత్సరాలలోపు చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ విద్యా బోధన అలవాటు చేస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలియజేస్తూ....

ప్రజాశక్తి: జిల్లాలో ఎన్ని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు ఏమిటి?

ఐసిడిఎస్ పీడీ: జిల్లాలోని 2420 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 23612 మంది గర్భిణులకు, బాలింతలకు బాల సంజీవని పథకం ద్వారా పది రకాల పోషకాహారం అందిస్తున్నాము. బియ్యం, కందిపప్పు, ఆయిల్, కోడిగుడ్లు, పాలతోపాటు బాల సంజీవని కిట్‌లో రాగిపిండి, అటుకులు, చెల్లం, వేరుశనగ చిక్కీలు, ఎండు ఖర్జూరం ఇంటి ఇవ్వడం జరుగుతోంది.

ప్రజాశక్తి: అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఎలాంటి పౌష్టికాహారం అందిస్తున్నారు.

ఐసిడిఎస్ పీడీ: జిల్లాలో ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల్లోపు ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లోని 61,738 పిల్లలకు బాలామృతంతో పాటు కోడిగ్రుడ్లు–25, పాలు పౌష్టికాహారంగా అందచేయటం జరుగుతుంది. అలాగే 3–5 సంవత్సరాల 32031 మంది పిల్లలకు సృజనాత్మకత, ఆట పాటలతో కూడిన విద్యను అందిచడంతో పాటు అంగన్వాడీ కేంద్రంలోనే మద్యాహ్న భోజనం, రోజుకి 1 కోడి గుడ్డు, 100 గ్రాముల పాలు చొప్పున అందచేయటం జరుగుతుంది.

ప్రజాశక్తి: అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి వసతులు ఏర్పాటు చేస్తున్నారు....?

ఐసిడిఎస్ పీడీ: జిల్లాకు నూతనంగా మంజూరైన 380 అంగన్వాడీ కేంద్రాలకు టాయిలెట్లు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. జిల్లాలో 495 అంగన్వాడీ కేంద్రాలకు తాగునీటి వసతి ఏర్పాటు చేశాం.

ప్రజాశక్తి : పోషణ అభియాన్ కార్యక్రమం ఎలా అమలవుతోంది?

ఐసిడిఎస్ పీడీ: పోషనాభియాన్‌లో భాగంగా గర్భవతులు, బాలింతల పోషణ విలువలను పెంపొందించుట కొరకు ప్రతి నెలా రెండు కమ్యునిటీ బేస్డ్ ఈవెంట్స్ అవగాహన కార్యక్రమాలు చేయడం జరుగుతోంది. ఈ కమ్యునిటీ బేస్డ్ ఈవెంట్స్ కార్యక్రమాలలో భాగంగా శ్రీమంతాలు, అన్నప్రసాన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్పాన్సర్‌షిప్ కింద తల్లిదండ్రులు లేని అనాధలకు, తల్లి లేదా తండ్రి మరణించిన పిల్లలు జిల్లాలో 380 మందికి నెలకు 4000 చొప్పున డిసెంబర్ 2024 వరకు రూ.91,20,000లు ఇవ్వడం జరిగింది.

ప్రజాశక్తి : కిషోరి బాలికల వికాసం కార్యక్రమం ఎలా అమలు అవుతుంది.?

ఐసిడిఎస్ పీడీ: కిషోరి వికాసం కార్యక్రమం అమలు చేయడానికి జిల్లా స్థాయిలో మండల స్థాయిలో సంబంధిత అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాం. జిల్లాలో బడి బయట ఉన్న కిశోరి బాలికలను గుర్తించి, గ్రూపులుగా విభజించి, వారికి అంగన్వాడీ కేంద్రస్థాయిలో, స్కూల్, కాలేజీ స్థాయిలో విద్య, ఆరోగ్యం, ఋతు క్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషణ, వృత్తి నైపుణ్యాలు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, యోగా వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలనపై 625 మహిళా పోలీసులకు, బాల్య వివాహ నిరోధక అధికారులకు చిత్తూరులోని పోలీసు శిక్షణా కేంద్రంలో 6 రోజులు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాం.

వెంకటేశ్వరి, స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్

యుద్ధం వద్దే వద్దు!

ఉగ్రవాదులపై పోరు మానవాళికి మేలు : రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల సూచన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశ పరిణామాలు పరిశీలిస్తే పాక్, భారత్‌ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నట్లు స్పష్టమవు తోంది. యుద్ధం వల్ల ప్రాణ నష్టం, ఆస్తుల నష్టంతోపాటు అభివృద్ధి శూన్యమవడం తప్ప సాధించేది ఏమీ ఉండదని చరిత్ర బట్టి తెలుస్తోంది. కాబట్టి పాకిస్తాన్‌పై కాక, ఉగ్రవాదంపై యుద్ధం ప్రకటించాలి. ఉగ్రవాదం తుద ముట్టడించడానికి మన దేశ శక్తి సామర్థ్యాలను కూడగట్టుకుని ముందుకు సాగాలి. ప్రధాని నరేంద్ర మోడీ యుద్ధానికి సిద్ధమవుతూ యుద్ధ విమానాలను సిద్ధం చేయడమే కాక, సైన్యాన్ని మన దేశ సరిహద్దులకు తరలించడం సరికాదని తిరుపతిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయ పడ్డారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి అంబేద్కర్ భవన్‌లో కన్వీనర్ పి.అంజయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ, సిపిఎం జిల్లాకార్యదర్శి వందవాసి నాగరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యుద్ధం పేరుతో దేశ సమగ్రత, సౌభ్రాతృత్వం దెబ్బతింటుం దన్నారు. మన దేశం లౌకిక భారతదేశం ఇక్కడ అన్ని కులాలు, మతాలు వారి వారి విశ్వాసాల ప్రకారం జీవించడానికి మన రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కల్పించడమే పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించడమని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన పాలకులు అధికారాన్ని కాపాడుకోవ డానికి మైనార్టీలను బూచిగా చూపెట్టి ముస్లిమ్స్ లపై కొన్ని ప్రేరేపిత సంస్థలు పనిగట్టుకుని భారతీయు ముస్లిం సోదరులపై విషం కక్కుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ప్రజలు కానీ, భారత్ ప్రజలు కానీ యుద్ధం కోరుకోవడం లేదని, మోడీ ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. యుద్ధంతో ఉక్రెయిన్, రష్యా దేశాలు వేలాదిమంది సిపాయిలను, ప్రజలను, ప్రజల ఆస్తులను నష్టం చేసుకుని వందేళ్లు వెనక్కి వెళ్ళాయనేది స్పష్టంగా మనకు అర్థమవుతోందన్నారు.

స్వర్ణముఖి.. 'దు:ఖ ముఖి'

- ప్రక్షాళన పనులు గాలికి
- నానాటికీ దుర్గంధమయం
- పట్టించుకోని పాలకులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :

ముక్కంటి పాదాల చెంత పవిత్ర స్వర్ణముఖి ప్రవహిస్తుండడంతో శ్రీకాళహస్తికి సద్యోముక్తి క్షేత్రం అన్న పేరు వచ్చింది. అగస్త్య మహర్షి తపస్సు ఫలితంగా స్వర్ణముఖి నది ఉద్భవించినట్లు శ్రీకాళహస్తి స్థల పురాణం చెబుతోంది. తిరుపతికి సమీపంలోని పాలకొండలో పుట్టి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వాకాడు వద్ద సముద్రంలో కలిసే స్వర్ణముఖి నది తిరుపతి జిల్లాలోనే అతిపెద్ద జల వనరు. అంతేగాక ఈ నదీ తీరంలో ముక్కోటి, తిరుచానూరు, గుడిమల్లం, శ్రీకాళహస్తి లాంటి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలు విరాజిల్లుతున్నాయి. ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలు ఈ నది తీరుస్తోంది. శ్రీకాళహస్తి దేవాలయం నిర్మాణం చేసిన కార్మికులకు వారి పనితనాన్ని బట్టి బంగారు దొరికేది. అందుకే దీనికి స్వర్ణముఖి అనే పేరు సార్థకమైంది. దీనినే మొగిలేరు అని దక్షిణ గంగ అని కూడా పిలుస్తారు. నదులకు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కరాలు జరుగుతాయి. అయితే స్వర్ణముఖి నదికి మాత్రం ప్రతి సంవత్సరం మాఘమాసంలో పుష్కరం జరుగుతుంది. ప్రతి ఏటా పుష్కరం జరిగే నది స్వర్ణముఖి మాత్రమే. అంతటి పరమ పవిత్రమైన నది అపవిత్రంగా మారిపోతోంది.

ప్రజల అవసరాలు..నాయకుల ధన దాహం..అధికారుల నిర్లక్ష్యం వెరసి స్వర్ణముఖి దుఃఖముఖిగా మారిపోయింది. పట్టణంలోని మురుగునీటిలో సగభాగం నదిలో కలుస్తుండంతో నది దుర్గంధ మయమయింది. ఒకప్పుడు ఈ నది నీటిని ప్రజలకు మున్సిపాలిటీ అందించేది. అయితే తెలుగు గంగ కాలువ తవ్వకం తర్వాత నదిలోని భూగర్భ జలాలను వినియోగించడం బాగా తగ్గింది. సంవత్సరంలో ఒకసారి నది నిండుగా పారితే ఏడాదిపాటు భూ గర్భంలో నీళ్లు పుష్కలంగా ఉండేవి. పట్టణంలో భవనాలు పడగొట్టినా, రోడ్లు, డివైడర్లు వెడల్పు చేసినా ఆ వ్యర్థాలన్నీ నదిలో పడేస్తున్నారు. దీంతో ఆలయానికి పక్కనే ఉన్న నది మరింత దుర్భరంగా తయారైంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నదిలో స్నానం చేయడానికి అనుకూల వాతావరణం లేకుండా పోతోంది. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బ తింటున్నాయి. పట్టణ పరిధిలోనైనా నదిని శుభ్రం చేయాలనే ఆలో చన నీటిపారుదల శాఖ అధికారులకు, దేవస్థానం అధికారులకు రావ డం లేదన్న విమర్శలున్నాయి. జల హారతుల పేరుతో గత ప్రభుత్వ హయాంలో హడావుడి జరిగినా, నదిలోకి మురుగునీరు చేరుతూనే ఉంది. ఈ నదిలో లభించే ఇసుక నాణ్యమైనది కావడంతో భవనాల నిర్మాణానికి ఎక్కువగా వాడుతున్నారు. దీంతో ఇసుకకు డిమాండు ఏర్పడింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయ కులు ఇసుకను అక్రమ రవాణా చేయడం కోట్ల రూపాయలు సంపాదించుకోవడం పరిపాటయింది. గతంలో తాగునీటికి, సాగునీటికి ఇబ్బంది లేకుండా సంతోషంగా ఉండేవారు. అయితే ఇసుక మాయమై, మురుగునీరు చేరి, వ్యర్థాలు రావడంతో నీళ్లు కలుషితం అయిపోయాయి.

ప్రక్షాళన పనులు గాలికి

గత వైసిపి ప్రభుత్వం హయాంలో స్వర్ణముఖి నది ప్రక్షాళన పేరిట తుడా నిధులు రూ. 18 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. మొదటి దశ పనులు మాత్రం జరిగాయి. ఆ పార్టీ అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రక్షాళన పనులు అటకెక్కాయి. స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ముఖ్య ఉద్దేశం, కానీ ఆ ఉద్దేశం మూలన పడిపోయింది. పట్టణంలో నుంచి వచ్చే మురుగునీటిని నదిలో కలవకుండా వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు పంపించి, అక్కడ శుద్ధి చేసి సాగునీరందించాలన్న ప్రతిపాదన కూడా ఉంది. ఆ మేరకు అర్ధనారీశ్వరాలయం సమీపంలో దాదాపు 12 కోట్ల వ్యయంతో ఎస్టీపీ ప్లాంట్‌ను కూడా గత ప్రభుత్వం హయాంలో నిర్మించారు. అయితే అది ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. స్వర్ణముఖి నదిలో మురుగునీటిని ఎస్ టి పి ప్లాంట్ కు చేరవేసేందుకు ఇంకా పైపులైన్లు కూడా వేయలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి స్వర్ణముఖి నది ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో స్వీకారం చుట్టి నది పవిత్రతను, భక్తుల మనోభావాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలో మెడికల్ షాప్ యజమానులు నిషేధిత మందులను యువతకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ బి.సుబ్బరాయుడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పట్టణంలోని కెమిస్ట్, మెడికల్ షాపు యజమానులతో పోలీసుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత ఎక్కువ మత్తుకు బానిస అవుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని మెడికల్ షాప్ యజమానులు వారు షాపు నిర్వహించుకోవాలన్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల వద్దకు మత్తుకు బానిసైన యువత ఎవరైనా వచ్చి టాబ్లెట్స్, సిరప్ అడిగినట్లు అయితే ఎవరు ఇవ్వకూడదని తెలిపారు. అలా ఇచ్చినట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రిని కలిసిన బుస నాగరాజు గౌడు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను చిత్తూరు టిడిపి కార్యాలయంలో చిత్తూరు పార్లమెంట్ టిడిపి ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుస నాగరాజు గౌడు ఆదివారం కలిశారు. బుస నాగరాజు గౌడు , జిల్లా సభ్యులు రెడ్డప్ప గౌడు దుశ్శాలువతో సత్కరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఈడిగలకు మద్యం షాపులు అందించడం హర్షణీయమని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గౌడ కులస్తులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానిస్తున్న బుసనాగరాజు గౌడు

భగీరథ మహర్షికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కార్యాలయ ఏవో కులశేఖర్

భగీరథ మహర్షికి నివాళులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : భగీరథ మహర్షి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి చిత్ర పటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో కులశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భగీరథ మహర్షి జయంతిని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డిడికె మునీంద్రయ్య, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వరరావు, బి సి సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాల్లో రాజేష్

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని చవట గుంట మహాభారత ఉత్సవాల్లో వైసీపీ నేత సత్యవేడు ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్ ఆదివారం హాజరయ్యారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభతో ఆహ్వానం పలికారు. శాలువా కప్పి సన్మానించారు. అమ్మవారి దర్శనం కల్పించారు. గుడి పూజారి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు. వేరు వేరు సమయాలలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కూడా హాజరయ్యారు.

రాష్ట్రంలో రాజధాని పై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి -పుంగనూరు : ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్ర రాజధాని అమరావతి అని రాష్ట్ర ప్రజలకు బాగా తెలిసే విధంగా ప్రచారం చేయాలని అందుకు తగుచర్యలు తీసుకోవాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సబ్జాద్ బాష రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. అమరావతి ప్రారంభోత్సవ కార్యక్రమాలు 'రాజధాని మా అమరావతి'లో జరిగిన ప్రసంగాలు(ప్రధాని, ముఖ్యమంత్రి)అమరావతి, వీడియో క్లిప్ ఫొటోలు రాష్ట్ర వ్యాప్తంగా సినిమా హాళ్లలో, టీవీల్లో రెండు నిమిషాలు ప్రసారాలు చేయాలి అన్నారు. ప్రతిరోజు అమరావతి రాష్ట్ర రాజధాని అని పట్టణ ప్రాంత గ్రామీణ ప్రాంత ప్రజల వరకు దీన్ని తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఫొటోలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి అన్నారు.

కర్నూలు డిసిఎంసిని కలిసిన శ్రీధర్‌యాదవ్

కర్నూలు డిసిఎంసిని కలిసిన చిత్తూరు యాదవ సాధికార సమితి శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర యాదవ సాధికార సమితి అధ్యక్షులు నాగేశ్వర యాదవ్ కర్నూలు డిసిఎంస్ ఛైర్మన్‌ను చిత్తూరు టిడిపి కార్యాలయంలో చిత్తూరు జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన డిసిఎంసి నాగేశ్వర్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, నంద్యాల బీసీ సాధికార అధ్యక్షులు గురప్ప యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

కృపాలక్ష్మికి వివాహ ఆహ్వాన పత్రికను అందిస్తున్న వైసిపి నాయకులు

కృపాలక్ష్మికి వివాహ ఆహ్వానం

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

వైసిపి గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృపా లక్ష్మిని వెదురుకుప్పం మండలం వైసిపి నాయకులు, పెరుమాళ్ల పల్లి ఎంపీటీసీ తోకల మురళి రెడ్డి, వైసిపి నాయకులు పురంధర్ రెడ్డి విజయవాడలోని ఆమె స్వగృహంలో ఆదివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 17వ తేదీ నిర్వహించనున్న వైసిపి నాయకులు పురంధర్ రెడ్డి చెల్లి వివాహ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొనాలని కోరి ఆహ్వాన పత్రికను అందించారు.

అలరించిన దుర్యోధన వధ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో మహాభారతం ఉత్సవాలలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం దుర్యోధన వధ పలువురిని అలరించింది. ఈ కార్యక్రమంలో భీమ దుర్యోధన యుద్ధ సన్నివేశాలు చూపరులను ఆకట్టుకుంది. ఈ సన్నివేశాన్ని చూడడానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి జనం హాజరై ఆసక్తిగా తిలకించారు. మహాభారతం చివరి రోజు రాత్రి 7 గంటలకు అగ్నిగుండ ప్రవేశం

నిర్వహించారు.

ఆశలు ఫలించేనా?

● మామిడి పంట కోతలు ప్రారంభం ● ఆశాజనక ధరలు లభిస్తాయని రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలో అక్కడక్కడా మామిడి కోతలు ప్రారంభమయ్యాయి. ఈసారి ధరలు ఆశాజనకంగా వుంటే రైతుల ఆశలు ఫలిస్తాయి.. వారి జీవితం మెరుగవుతుంది. మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉంటాయని మామిడి రైతులు ఆశతో నిరీక్షిస్తున్నారు. సంవత్సరానికి ఓ సారి వచ్చే మామిడి పంట రైతుల ఆశలు చిగురిస్తాయో లేదో వేచి చూడాలి...రెండు వారాల క్రితం గాలివానకు మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది..ఈ పరిస్థితుల్లో రైతుకు ఆశాజనక ధర పరీక్షగా మారింది.

మామిడి పంట కోతలు ప్రారంభం

వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. ఎక్కువ భాగం రైతులు మామిడి సాగు చేస్తున్నారు. సుమారు 3వేల హెక్టార్లపైన విస్తీర్ణంలో మామిడి వుంది. ఈ సంవత్సరం ఏప్రిల్ మొదటి వారంలోనే తిరుపతి మామిడికాయల మండీలు తెరిచారు. దీంతో రైతులు మామిడి కాయలు కోసి, మండీలకు తరలిస్తున్నారు.

ఆశాజనక ధరల కోసం నిరీక్షణ

ప్రస్తుతం ముందస్తుగా బేనీషా రకం కాయలు కోస్తున్నారు. కేజీ ధర రూపాయలు 35 గా వుందని మండీల వ్యాపారులు పేర్కొంటున్నారు. టన్ను 35 వేల రూపాయలుగా వుంది. పుత్తూరు, చిత్తూరు, పలమనేరు, దామలచెరువు, బంగారుపాళ్యం తదితర ప్రాంతాలలో ఈ మామిడి కాయల మండీలు వున్నాయని వ్యాపారులు, రైతులు పేర్కొంటున్నారు. ఎక్కడ ధర బాగుంటే అక్కడికి

మామిడి కాయలు కోసి మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

మామిడి కాయలు తరలిస్తారు. ఈ సారి మామిడి కాయలు ధరలు ఎలా ఉంటాయో రైతులు నిరీక్షిస్తున్నారు.

గాలి వానకు తీవ్రనష్టం

రెండు వారాల క్రితం మండలంలో కురిసిన గాలివానకు పది ఎకరాల్లో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. జక్కిదొన, జంటవారిపల్లి, నల్లవెంగనపల్లి, తిరుమలయ్యపల్లి, దేవరగుడిపల్లి పంచాయతీల్లో 20 మంది రైతులకు చెందిన పది ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయి నష్ట పోవాల్సి వచ్చింది. సుమారు ఐదు లక్షల రూపాయల మేర నష్టం ఎదురై వుంటుందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మామిడి పంట చివరి దశ కోతకు రావడంతో వచ్చిన కాస్త దిగుబడికైనా మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తుందో లేదోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

మండీలలో దళారుల బెడద ఎక్కువ

మండీలలో దళారులు ఎక్కువగా ఉన్నారు. కమిషన్ ఎక్కువ.. తిరుపతి మామిడి కాయల మండీలలో దళారులు పాత్ర ఎక్కువగా వుంది. టన్నుకు రూ.7నుంచి రూ.10 వరకు ఉంటుంది. దీంతో రైతులు నష్టపోతు న్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేదు. మండీ వ్యాపారులు వారి ఇష్టానుసారం వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి...

- పందికుంట భాస్కర్ రెడ్డి, మామిడి రైతు, వావిలిచేను గ్రామం, వెదురుకుప్పం మండలం.

బయట వ్యాపారులు వస్తేనే మార్కెట్

బయట వ్యాపారులు వస్తేనే మార్కెట్.. ఎక్కడి మార్కెట్ అయినా ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు మన రాష్ట్రానికి వస్తేనే వ్యాపారం పుంజు కుంటుంది. మామిడి పంటను పక్క రాష్ట్రాలకు తరలిస్తే రైతులకు ఆదాయం ఉంటుంది. ధరలు ఆశాజనకంగా ఉంటాయి. ఇప్పుడే మార్కెట్ ప్రారంభమైంది.. ఎలా ఉంటుందో వేచి చూడాలి.

- సుబ్రహ్మణ్యం రెడ్డి, అగ్గి చేనుపల్లి గ్రామం, వెదురుకుప్పం మండలం.

ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌ను సన్మానిస్తున్న అర్చకుడు

ఆలయ కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, గుడిపాల : చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం గుడిపాల మండలం పిల్లారికుప్పం గ్రామంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన మహా కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. మండలం, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కుంభాభిషేకం, హోమ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు.

శ్రీదుర్గకు నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

శ్రీదుర్గకు మంత్రి నివాళి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఇటీవల మృతి చెందిన టిడిపి చిత్తూరు పార్లమెంటరీ మహిళా కార్యదర్శి డి శ్రీదుర్గ చిత్రపటానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఇతర టిడిపి నాయకులు నివాళులు అర్పించారు. సంతపేటలో నిర్వహించిన ఉత్తర కర్మక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి టిడిపి అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ డాక్టర్ రామచంద్రారెడ్డి మృతి

రామ చంద్రారెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు పరిసర ప్రాంతాల్లో వైద్య వృత్తిలో మంచి పేరు ప్రఖ్యాతలు పొందిన సీనియర్ వైద్యులు డాక్టర్ రామ చంద్రారెడ్డి (77) ఆదివారం వేకువ జామున మృతి చెందారు. రామసముద్రం మండలం మాలేనత్తం గ్రామానికి చెందిన డాక్టర్ రామచంద్రారెడ్డి పుంగనూరు పట్టణంలో 45 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో ఉన్నారు. ఈమె భార్య ఏ జ్ఞానావతి కూడా వైద్యులుగా పుంగనూరులో ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో వైద్యులుగా మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకున్నారు. అనారోగ్యం కారణంగా డాక్టర్ రామచంద్రారెడ్డి మృతి చెందాడు. ఈయన మృతి పట్ల పట్టణంలో పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఈయన కుమారుడు డాక్టర్ తేజ చిన్న పిల్లల వైద్య నిపుణులుగా సేవలు అందిస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుడి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో శ్రీ భూదేవి శ్రీదేవి సమేత లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణోత్సవం ఆదివారం రమణీయంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి స్వామి అమ్మవార్ల విగ్రహాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పట్టు వస్త్రాలు సమర్పించి అర్చకుల వేదమంత్రోచ్చారణ మధ్య వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నై నగరానికి చెందిన దీన దయాలన్ ఉభయ దారులుగా వ్యవహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం, అన్నమయ్య సంకీర్తన భక్తులను అలరించింది. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉభయ దారులకు స్వామి చిత్రపటాన్ని ఆలయ సిబ్బంది అందించారు.

మాజీ ఎంపీపీ రాజారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ఎట్టేరి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మొట్టమొదటి ఎంపీపీ రాజారెడ్డి గత కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఆదివారం రాజారెడ్డి కర్మ క్రియలకు విచ్చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆయన చిత్ర పటానికి నివాళు లర్పించారు. మండలాన్ని ప్రగతి పథంలో నడిపిం చిన ప్రముఖులలో రాజారెడ్డి ఒకరని, రాజారెడ్డి సేవలు ఎనలేనివని ఆయన గుర్తు చేశారు. రాజారెడ్డికి సత్యవేడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి రాజేష్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, వైసిపి నాయకులు కృష్ణారెడ్డి , రఘునాథరెడ్డి, శ్రీరాములు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎంపీపీకి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

అభివృద్ధిలో భాగస్వాములవుతాం: జనసేన

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణం గా ఆయన నాయకత్వంలో పని చేస్తూ, కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్ర బాబు సొంత నియోజక వర్గంలో చేస్తున్న అభివృద్ధిలో భాగస్వాములు అవుతామని కుప్పం మండలం అడవిబూదుగూరు గ్రామానికి చెందిన యువత పేర్కొన్నారు. జనసేనలో ఆదివారం వారు చేశారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేష్ యువతకు జనసేన కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో స్థానిక ఎన్నికలు రానున్న వేళ జనసైనికులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేయాలని సూచించారు.

జనసేనలో చేరిన అడవిబూదుగూరుకు చెందిన యువకులు

ఘనంగా వాసవి జయంతి వేడుకలు

ప్రజాశక్తి -పుంగనూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు పట్టణం లోని బజారు వీధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బజారు వీధిలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నుండి 102 కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి కోనేటి వద్ద పూజలు నిర్వహించి తిరిగి వాసవి ఆలయం వద్దకు జలాలతో చేరుకొని అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కె బాలసుబ్రమణ్యం, అమరావతి సురేష్, సంఘ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


వాసవి జయంతి వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు

ప్రజా నాయకుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజా నాయకుడు మాజీ జెడ్‌పిటిసి , చిత్తూరు ఉమ్మడి జిల్లా వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గురువారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనను ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్టలో ఎస్ఆర్ పురం మండలం వైసిపి మండల కో ఆప్షన్ మెంబరు యేసు రత్నం కొత్తపల్లి యువత కేక్ కట్ చేసి శాలువా కప్పి గజమాలతో సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో థామస్ ముని చంద్ర, థెరీసా శ్యామ్ తేజ, గోవిందరెడ్డి, కొత్తపల్లి యువత గ్రామస్తులు పాల్గొన్నారు.

గురవారెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం కడా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను వాయిదా వేస్తున్నట్టు కడా పీడీ వికాస్ మరమ్మాత్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వుంది. ఇందులో భాగంగా కుప్పం కడా వారు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం జరుగుతోంది. అయితే కొన్ని అనివార్య కారణాలవల్ల ఈనెల 5వ తేదీ నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేస్తు న్నట్టు తెలిపారు. ఇందుకు నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కడా పీడి కోరారు.

క్రైం న్యూస్

అక్కపై చెల్లెలు దాడి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: తల్లిదండ్రులకు ఇష్టం లేని పెళ్లి చేసుకుందని అక్కపై చెల్లెలు దాడి చేసిన సంఘటన ఆదివారం మండలంలోని కట్టప్ప గారి పల్లి వద్ద చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ కథనం మేరకు.. కట్టప్ప గారి పల్లి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు రాజశేఖర్ పలమనేరు చెందిన మున్ని బాష కుమార్తె చాందిని ఇద్దరూ పలమనేరు ఒక ప్రైవేట్ కళాశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ ప్రేమించుకున్నారు. 40 రోజుల క్రితం ఆలయంలో వివాహం చేసుకున్నారు. అప్పటినుంచి చాందిని వాళ్ల చెల్లెలు తరచూ ఫోను ద్వారా చాందినిని ఇంటికి వచ్చేయాలని పిలవడంతో చాందిని వెళ్లలేదు. దీంతో వారి చెల్లెలు ఆదివారం కట్టప్ప గారి పల్లి చేరుకుని రాజశేఖర్, చాందినిపై కత్తితో దాడి చేశారు. రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పోలీసుల సమక్షంలో భక్తుడికి ఉంగరాన్ని అప్పగిస్తున్న ఆలయ పెద్దలు

పోగొట్టుకున్న బంగారు ఉంగరం అందజేత

ప్రజాశక్తి - రామకుప్పం: ఆలయంలో ఓ భక్తుడు పోగొట్టుకున్న ఉంగరాన్ని అర్చకుడు తిరిగి ఆదివారం అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. రామకుప్పం లోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో గత మార్చి నెల 30వ తేదీ రెండు గ్రాముల బంగారు ఉంగరం శాంతిపురం మండలానికి చెందిన భక్తుడు ప్రవీణ్ కుమార్ ఆలయ దర్శనానికి వచ్చి పోగొట్టుకున్నాడు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయం లోపల వినాయక స్వామి విగ్రహం వద్ద ఉంగరం పడి ఉండడాన్ని అర్చకులు వాసు స్వామి గమనించారు. ఆయన వెంటనే ఆలయ నిర్వాహక సభ్యుడు సీతాపతికి అందజేశాడు. ఆదివారం బాధితుడు ప్రవీణ్ కుమార్‌కు పోలీసుల సమక్షంలో ఆ బంగారు ఉంగరాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రప్ప, కృష్ణమూర్తి, రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు కథనం మేరకు బంగారుపాలెం దళితవాడకు చెందిన నాగయ్య కుమారుడు వినాయక (48) అతిగా మద్యం తాగి స్పృహ కోల్పోయి ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విఆర్‌ఏల రాష్ట్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా యామల లక్ష్మణ

ప్రజాశక్తి -రొంపిచర్ల: బొప్పరాజు వెంకటేశ్వర్లు ఛైర్మన్‌గా కొనసాగుతున్న ఏపీఆర్ఎస్ఏ అండ్ ఏపీజేఏసీ అమరావతి అనుబంధ సంఘం రాష్ట్ర విఆంలేల అసోసియేషన్‌లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రొంపిచర్ల మండలానికి చెందిన యామల లక్ష్మణను రాష్ట్ర విఆర్ఏల సంఘం అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ సంఘంలో విఆర్ఏలు కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరిని గుర్తించాల్సిన అవసరం ఉంటుందని అలాంటి వ్యక్తిగా యామల లక్ష్మణకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించిన బొప్పరాజు వెంకటేశ్వర్లుకు, విఆర్ఏల రాష్ట్ర సంఘం అధ్యక్షులు బ్రహ్మయ్య కృతజ్ఞతలు తెలుపుతూ విఆర్ఏల సమస్యల సమస్యల పరిష్కారానికి అనునిత్యం పనిచేస్తామని తెలిపారు.

ఉచిత ఆపరేషన్లకు ఎంపికైన వారితో డాక్టర్లు, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:

బైరెడ్డిపల్లి మహతి ఫౌండేషన్ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి మండలానికి చెందిన కంటి సమస్య బాధితులు 47 మంది హాజరయ్యా రు. వారిని పిఎస్ ఆసుపత్రి కుప్పం డాక్టర్లు వివిధ కోణాల్లో పరిశీలించి వారిలో ఏడుగురిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. గుర్తించిన వారికి కంటి ఆపరేషన్ చేయించి ఇంటికి చేర్చే వరకు వారి ఖర్చులు బైరెడ్డిపల్లి మహతి ఫౌండేషన్ మేనేజర్ నాగరాజు అందిస్తున్నట్లు సహాయక మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. అంతే కాక 45 మందిని పరిశీలించి వారికి తగిన మందులు, మాత్రలు అందిం చామని డాక్టర్ తెలిపా రు. ప్రతి నెలా మొదటి ఆదివారం మహతి ఫౌండేషన్‌ఛైర్మన్ నాగరా జు సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, వారి బృందం, బిఎస్ హాస్పిటల్ డాక్టర్, కంటి సమస్య బాధితులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పాఠశాల 1992-93 సంవత్సరంలో పదవ తరగతి విద్యాభ్యాసం చేసిన విద్యార్థిని విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో వారి గురువులతో సహ కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులకు స్వాగతం పలుకుతూ కండువా కప్పి పూలమాలవేసి గురువులను ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గురువుల ఆశీర్వాదమే తమకు అండ అని, తమకు విద్య నేర్పిన గురువులు అప్పట్లో తమకు బాధాకరమే అయినా ఇప్పుడు రోజుకు వందసార్లు గురువుల మాటలే గుర్తుకు వస్తుంటాయని వారు ఉపాధ్యాయులకు తెలిపారు. అప్పటి సైన్స్ మాస్టర్ బాల చంద్రనాయుడు మాట్లాడుతూ అప్పుడైనా ఇప్పుడైనా విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చున్నారు. దీన్ని మీ పిల్లలు కూడా తెలపాలని, కుల మతాల చిచ్చులో పడకుండా అందరూ ఒకటిగా మెలుగుతూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ఏర్పాటు చేసిన విందు భోజనం తిని కాసేపు పాత కబుర్లు నెమరవేసుకుంటూ కాలం గడిపారు . అనంతరం అందరికీ వీడ్కోలు పలుకుతూ వచ్చే సంవత్సరం మళ్లీ అందరూ కుటుంబ సమేతంగా పాఠశాలకు హాజరుకావాలని విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1992-93 పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యా యులు, సైన్స్ టీచర్ బాలచంద్రనాయుడు, డ్రాయింగ్ మాస్టర్ రామానాయుడు, దేవరాజు జై చంద్రన్న, కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు